క్లుప్తంగా

నేడూ పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: పన్ను చెల్లింపుకు వీలుగా ఆదివారం కూడా క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని కమిషనర్ కీర్తి చేకూరి శనివారం తెలిపారు. ఆస్తి పన్నును ఏకమొత్తంగా నెలాఖరులోపు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. పన్ను చెల్లింపు సమాచారం కోసం ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో అదనపు క్యాష్ కౌంటర్లు, భారత్‌పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డ్ సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆమె వెల్లడించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పట్నంబజారు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం నాజ్ సెంటర్‌లో సిబ్బంది అగ్నిమాపక శకట వాటర్ బ్రౌజర్‌తో విన్యాసాలు చేపట్టారు. అగ్ని ప్రమాదాలు జరిగితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై నగర ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వాల్‌పోస్టర్లు అతికించడంతో పాటు, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఎస్.పార్థసారథి, గుంటూరు -1, 2 అధికారులు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలుచోట్ల చలివేంద్రాల ప్రారంభం

గుంటూరు మెడికల్: లైవ్ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాల్ని శనివారం బీజేపీ సీనియర్ నాయకులు వనమా పూర్ణచంద్రరావు, గూడూరు రాంబాబు, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ బాలచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రజల దాహార్తిని నగర ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, గూడూరు రాంబాబు, బొల్లా ప్రగడ శ్రీదేవి, మండల ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, రంగయ్య, నాదెండ్ల రమేష్, జయకృష్ణ, యక్కల మధు, నరేష్, షకీల్, రాఘవ, సూర్య పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

గుంటూరు రూరల్: వ్యక్తిపై దాడి ఘటనలో ప్రత్తిపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన కొల్లూరి జయబాబు గ్రామస్తులతో పాటు అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్నాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా, ఉత్సవాల్లోని టపాసుల్ని పేల్చినందుకు అదే గ్రామానికి చెందిన ముప్పా నాని, నీలం పిచ్చయ్య, నీలం రామారావు, సాగర్ తనపై దాడిచేసి గాయపరిచారని జయబాబు ఫిర్యాదు చేశాడు.

బస్సులో నుంచి జారి పడిన వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: బస్సులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోపాల్‌దాస్(33) తెనాలిలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. తెనాలి నుంచి గుంటూరుకు ఆర్టీసీ బస్సులో శనివారం మధ్యాహ్నం బయలుదేరాడు. బుడంపాడు వద్ద బస్ ఫుట్‌పాత్ నుంచి జారి పడ్డాడు. ప్రమాదంలో గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అద్దె వసూలుపై లోకాయుక్తలో ఫిర్యాదు

పెదకాకాని: అసైన్డ్ భూమిలో గోడౌన్ నిర్మించిన వ్యక్తి నుంచి రూ. 87 లక్షల అద్దె వసూలు చేయాలని అప్పసాని చంద్రశేఖర్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో జాతీయ రహదారి పక్కనే 1981లో ఓగిరాల ఆదినారాయణకు ప్రభుత్వం 60 సెంట్లు డీకె పట్టా మంజూరు చేసింది. ఆ భూమిని చెరుకూరి వాసుదేవరావు, చౌడేశ్వరరావు కొనుగోలు చేయగా వారి వద్ద నుంచి తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన వెలినేని శ్రీనివాసరావు కొనుగోలు చేశాడు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఆ స్థలంలో గోడౌన్ నిర్మించి అద్దెకు ఇచ్చాడు. దీనిపై గతంలో గ్రామానికి చెందిన అప్పసాని చంద్రశేఖర్, కిలారి రాజారమేష్‌లు అక్రమంగా నిర్మించిన గోడౌన్‌ను తొలగించాలని, ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత కొంతకాలానికి పెదకాకాని రెవెన్యూ అధికారులు గోడౌన్‌ను సీజ్ చేశారు. ప్రస్తుతం గతంలో ఉపయోగించుకున్నందుకు గోడౌన్ యజమాని నుంచి రూ. 87లక్షలను అద్దె రూపంలో వసూలు చేయాలని తక్కెళ్లపాడుకు చెందిన అప్పసాని చంద్రశేఖర్ లోకాయుక్తను ఆశ్రయించారు. గోడౌన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే లోకాయుక్తకు అందజేసినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తదితరులు

- ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య
- పెదకాకానిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పెదకాకాని: నాయీ బ్రాహ్మణులకు రాజ్యాధికారం, సామాజిక గుర్తింపు వైఎస్సార్ సీపీ ద్వారానే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పేర్కొన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని కేశ ఖండనశాల వద్ద శనివారం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు ఉద్యోగ భద్రత కల్పించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు, కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమాన్ని, వారి పిల్లల భవిష్యత్తును ఏ నాడూ పట్టించుకోని మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పెద్ద మోసకారి అని విమర్శించారు. కుల దూషణపై జీవో తీసుకు రావడంతో పాటు నాయీ బ్రాహ్మణులు ధైర్యంగా జీవనం సాగించేందుకు అండగా నిలిచిన, ఆలయ పాలకవర్గాల్లో స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం జేఏసీ అధ్యక్షులు గుంటుపల్లి రామదాసు, వెంకటరమణ, కోశాధికారి ఎస్.జి.ఎల్. నారాయణ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమసంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, గుంటూరు జిల్లా నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యు. నాగలక్ష్మి, స్థానిక సంఘ పెద్దలు మున్నంగి పాములు, అప్పారావు, శివనాగమల్లేశ్వరరావు, బాజీరావు, కొమ్మూరి సదాశివరావు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య శనివారం పెదకాకాని శివాలయానికి వచ్చారు. ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా నవగ్రహ పూజ, రాహుకేతువు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి శేషవస్త్రంతో అర్చకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల మంజూరు



వృద్ధురాలి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పరిపాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలు-1 గ్రామ సచివాలయం పరిధిలో శనివారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేయడంతో పాటు సమస్యల్ని తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, గ్రామ సచివాలయ పరిపాలనను ముఖ్యమంత్రి అమలు జరపడంతో దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, షేక్ సుభాని, నాగూర్, షరీఫ్, చౌడయ్య, వై. మమత, హరిబాబు, ఎంపీడీవో బాబూరావు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



విజయ చిహ్నం చూపిస్తున్న పదవ తరగతి విద్యార్థినులు

కాకుమాను: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని చినలింగాయపాలెం,కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరిగాయి. కాకుమాను పాఠశాలలో 246, చినలింగయపాలెం పాఠశాలలో 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. శనివారంతో పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. విజయచిహ్నంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరి చిరునామాలు మరొకరు తీసుకున్నారు. నేస్తమా.. త్వరలో కాలేజీల్లో కలుసు కుందాం అంటూ ఒకరికొకరు వీడ్కోలు తెలుపుకున్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి జగనన్న లక్ష్యం



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుంటూరు రూరల్ (ప్రత్తిపాడు): ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల్ని ఇంటి ముందుకే అందజేస్తున్నారని ప్రత్తిపాడు మండల వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. మండలంలోని రావిపాటివారిపాలెంలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్ని వివరించారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ నబీ, వెంకటరావు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యకు ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థితో పాటు తల్లిదండ్రులను సన్మానిస్తున్న మస్తాన్ చౌదరి , డైరెక్టర్, ప్రిన్సిపాల్

చేబ్రోలు: రానున్న కాలంలో పాలిటెక్నిక్ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు గొట్టిపాటి మస్తాన్ చౌదరి తెలిపారు. చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం డిప్లొమా కళాశాల రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్ని సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ దూళ్ల శ్రీధర్ అధ్యక్షత వహించారు. మస్తాన్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్ని క్రమశిక్షణతో కూడిన విద్య జీవిత లక్ష్యాన్ని చేరుస్తుందని తెలిపారు. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ మాలెంపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాన్ని సులువుగా సాధిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు డొంక రోడ్లకు మోక్షం



రోడ్డు నిర్మాణ ప్రారంభోత్సవంలో నల్లమోతు శివరామకృష్ణ, అధికారులు

కాకుమాను: నలభై సంవత్సరాల రైతుల కల తీరనుంది. స్థానిక శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత కృషితో డొంక రోడ్లకు మోక్షం కలగడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న డొంకల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎస్సీ కాలనీ నుంచి శ్మశానవాటికకు వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల డొంకను రూ.50 లక్షలతో సీసీ రోడ్డుగా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. 8వ నంబర్ బ్రాంచ్ నుంచి గరికపాడు పంచాయతీ పరిధిలోని రంగానగర్ కాలనీకి వెళ్లే సుమారు కిలోమీటర్ల డొంక రోడ్డును రూ.15 లక్షలతో గ్రావెల్ రోడ్డుగా, దీపారాయుడు కుంట నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు సుమారు మూడు కిలోమీటర్ల మేర డొంకను గ్రావెల్ రోడ్డుగా నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన దాతల సహకారాలతో రాముడు కుంటకు వెళ్లే డొంకను గ్రావెల్ రోడ్డుగా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత కృషితో మండలంలోని పలు డొంకలు అభివృద్ధికి నోచుకున్నాయని ఆయన తెలిపారు.దీని వలన కాకుమాను,పెదనందిపాడు మండలాల్లోని పలు గ్రామాల రైతులకు వ్యవసాయ పనుల కష్టాలు తీరనున్నాయని చెప్పారు. వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి అన్ని డొంకలను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.శరత్ బాబు, పార్టీ నాయకులు నల్లమోతు వీరయ్య, పోతినేని ప్రసాద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో సుధారాణి

పెదనందిపాడు: భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుందని, అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో సుధారాణి తెలిపారు.మండల పరిధిలోని నాగులపాడులో శనివారం మధ్యాహ్నం మట్టి నమూనాల సేకరణపై రైతుకు శిక్షణ ఇచ్చారు. ఏవో సుధారాణి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విధంగా ఎరువులు, పురుగు మందులు వాడితే ఎక్కువ ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని, వేయబోవు పంటలకు ఎరువుల మోతాదుల్ని నిర్ణయించాలని సూచించారు. స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు తెలుసుకోవడానికి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని రైతులకు చెప్పారు. భూసార పరీక్షను అనుసరించి ఎరువులు వాడటం వల్ల సుస్థిర దిగుబడులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్, హార్టీకల్చర్ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఏసీల చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: చోరీల చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్‌లో నివసించే కృష్ణారావు రింగ్ రోడ్డులో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించి రెండు ఏసీలను ఎత్తుకు పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శానిటైజర్ తాగిన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్యాంగ్ కాలనీకి చెందిన చిలకా నాగేశ్వరరావు సిమెంట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శానిటైజర్‌కు బానిసై, తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడ్ని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

వ్యక్తిపై దాడి

ఓ వ్యక్తిపై పలువురు దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. స్టాల్ గరల్స్ హైస్కూల్ సమీపంలో నివసించే రామస్వామిరెడ్డి కొరిటెపాడు సెంటర్‌లోని బాలాజీ కార్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈనెల 11న ట్రావెల్స్ దగ్గర బాడుగ విషయంలో రామస్వామిరెడ్డి మరో వ్యక్తి చిన్నతో గొడవ పడ్డాడు. అనంతరం చిన్న మరికొంత మందితో రామస్వామి ఇంటికి వెళ్లి తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. శనివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వృద్ధుడి అదృశ్యం



వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతీనగర్ 4వ లైనులో నివసించే దేవరకొండ భాస్కరరావు తండ్రి వెంకటేశ్వర్లు(68) ఈనెల 5న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మహిళ అదృశ్యం

మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శివనాగరాజు కాలనీలో నివసించే ఓ కుటుంబానికి చెందిన మహిళ శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ఈద్గాల వద్ద మౌలిక వసతుల కల్పన: మేయర్



మేయర్ తో సమావేశమైన ముస్లిం మత పెద్దలు

నెహ్రూనగర్: రంజాన్ పండుగ పురస్కరించుకుని ఈద్గాల వద్ద మౌలిక వసతుల్ని కల్పించనున్నట్లు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. ముస్లిం మత పెద్దలు శనివారం ఆయన్ను చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ రోజున ప్రత్యేక ప్రార్థనలు జరుపుకొనే రమేష్ హాస్పిటల్ వద్ద గల అంజుమన్ ఇస్లామియా ఈద్గా, పాత బస్టాండ్ వద్ద గల ఉర్దూ పాఠశాల ఈద్గా, పొన్నూరు రోడ్డు ముస్లిం కళాశాలలోని ఈద్గాల వద్ద వసతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, జంగిల్ క్లియరెన్స్, తాగునీరు, టెంట్లు, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహమూద్, ఖాజా మొహిద్దీన్ చిష్టి, షేక్ మీరవాలి, మహమ్మద్ అబీద్ బాష, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ కర్నూమ, సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ సలాం, డైరెక్టర్ హిదాయత్, మాజీ డెప్యూటీ మేయర్ షేక్ గౌస్, రహమాన్ పాల్గొన్నారు.


విద్యార్థినులు వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ రాణించాలి



ఉపకార వేతనాల పంపిణీలో తులసి రామచంద్ర ప్రభు, జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ పట్టభద్రులుగా ఎదిగిన తరువాత విద్యార్థినులు వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ రాణించాలని తులసి గ్రూప్ సంస్థల చైర్మన్ తులసి రామచంద్రప్రభు సూచించారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం కళాశాల 81వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రప్రభు మాట్లాడుతూ డిగ్రీ తర్వాత విద్యార్థినులు వివాహం చేసుకుని కుటుంబాలకు పరిమితం కాకుండా వ్యాపార, వాణిజ్య, రాజకీయ తదితర రంగాల్లో మగవారి కంటే మిన్నగా ముందుకు దూసుకు వెళ్లాలని సూచించారు. మహిళలు వంటింటికే పరిమితం కారాదని, అంతరిక్ష కేంద్రాల్లో సైతం వారి ప్రతిభ అమోఘమని కొనియాడారు. చేసే ఏ పనిలోనైనా, ఏ రంగంలో నైనా దేశ సౌభాగ్యాన్ని కాంక్షించాలని చెప్పారు. పరోపకారమే సమాజహితమని, ఆ సమాజహితమే దేశ హితమని పేర్కొన్నారు. ఈ దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలకు సైతం సిద్ధపడే వీర సైనికుల్ని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాల విద్యార్థినులకు రూ.నాలుగు లక్షల చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థినులకు రూ.40వేల ఉపకార వేతనాలను ఆయన అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాల కళాశాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు దాతల సహకారం మరువలేనిదని తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ



గుంటూరు మెడికల్: గర్భిణులు తమ ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఎదుగుదల, ఆరోగ్యం కోసం తప్పనిసరిగా అన్ని పోషకాలు కలిగిన సమీకృత ఆహారాన్ని తీసుకోవాలని ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు, అహల్య ఐవీఎఫ్ సెంటర్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ సూచించారు. కొత్తపేటలోని అహల్య ఐవీఎఫ్ నర్సింగ్ హోంలో గర్భిణులు, బాలింతలకు శనివారం ఆయన పౌష్టికాహారాన్ని అందజేసి అవగాహన కల్పించారు. గర్భం దాల్చింది మొదలు కాన్పుయ్యే వరకు విటమిన్ ఏ, విటమిన్ డీ, ఫోలిక్ యాసిడ్, కాల్షియం తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. కూల్‌డ్రింక్‌లు, జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. రసాయనాలతో పండించకుండా కృత్రిమంగా పండిస్తున్న ఆర్గానిక్ ఆహార పదార్థాల్ని తీసుకోవడం మంచిదని సూచించారు.

'రసధ్వని' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న లక్ష్మణరావు, పాపినేని శివశంకర్ తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రాంగణంలో డాక్టర్ సంజీవదేవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రసధ్వని పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మన్నం వెంకటరాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ సంజీవదేవ్ అత్యంత ప్రతిభావంతుడైనా, సామాజిక జీవనంలో చాలా సాధారణంగా ఉండేవారని తెలిపారు. ఆయన రచనా వైభవం, వ్యక్తిత్వం ప్రశంసనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లంకా కృష్ణానంద్, మోదుగుల రవికృష్ణ, లంక సూర్యనారాయణ, లంక విజయ సారథి, ఫౌండేషన్ కార్యదర్శి వై.వి. రావు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ చేస్తున్న జాహ్నవి కార్తీక

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నమయ్య కళా వేదికపై డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో నెలవారి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం సంగీత కచేరీ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన గావించారు. ఎస్.ఏ.జాహ్నవి కార్తిక వయోలిన్ సంగీత కచేరి ప్రేక్షకుల్ని అలరించింది. అనంతరం నిడమర్తి లోహితదత్త గాత్ర కచేరీ శావ్యంగా జరిగింది. వీరికి వయోలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై సురేష్ బాబు, ఘటంపై ఫణి భూషణ్ సహకరించారు. కార్యక్రమాన్ని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం. హరిబాబు పర్యవేక్షించారు.

కళాకారులకు విశ్వనాథ్ పురస్కారాలు

పాత గుంటూరు: కొరిటెపాడు ఎల్‌వీఆర్ రీడింగ్ రూం వేదికగా కేఆర్‌కే ఈవెంట్స్, కళా విపంచి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి చతుర్థి సంబరాల్లో భాగంగా శనివారం కళాతపస్వి డాక్టర్ కె.విశ్వనాథ్‌కి కళాంజలి పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సభలో ముఖ్య అతిథులుగా సినీ నిర్మాత ఏడిద రాజా, ఏడిద శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి నాట్యాచార్య డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం, శ్రీనివాస ఆర్ట్స్ అకాడమి ఎస్. సుశీల శ్రీనివాస్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. అనంతరం రంగస్థల నటులు ఎస్. రవీంద్రరెడ్డి, వై.ఎస్. కృష్ణేశ్వరరావుకు విశ్వనాథ్ రంగస్థల పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థల నటులు ఎం.వి.ఎల్ నరసింహారావు, డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, వెంకటేశ్వర వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి వేములపల్లి విఠల్, పి. దర్శిత్, కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్, కళావిపంచి అధ్యక్ష, గౌరవాధ్యక్షులు బొప్పన నరసింహారావు, రామరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు, జి.వి.జి.శంకర్ పర్యవేక్షించారు.